ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

విజయనగరం

జిల్లా వార్తలు

బుధవారం 24 ఏప్రిల్ 2024



# నేడు చంద్రబాబు.. పవన్‌కల్యాణ్ ఉమ్మడి సభలు

● డెంకాడ.. విజయనగరంలో ఏర్పాట్లు

(విజయనగరం, ఆంధ్రజ్యోతి)

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కలిసి పాల్గొనే ఉమ్మడి సభలు బుధవారం జిల్లాలో రెండుచోట్ల జరగనున్నాయి. బీజేపీ నాయకులు కూడా హాజరవుతారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడలో ఒక సభ జరగనుంది. జనసేన అభ్యర్థి లోకం నాగమాధవి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మరో సభ విజయనగరంలో జరగనుంది. బుధవారం మధ్యాహ్నం నిర్వహించే అధినేతల పర్యటన షెడ్యూల్ ఇలా ఉంది. 2.30కి డెంకాడ మండలం చందకపేట హెలీపాడ్ వద్దకు చంద్రబాబు చేరుకుంటారు. ఇంచుమించుగా అదే సమయానికి పవన్‌కల్యాణ్ కూడా విశాఖ నుంచి డెంకాడకు వస్తారు. ఇద్దరూ 2.45కి రోడ్డు మార్గంలో డెంకాడ మండలం సింగవరం గ్రామానికి చేరుకుంటారు. 3నుంచి 4.30వరకు సభలో పాల్గొంటారు. 4.40కి బయలుదేరి 5.05కి కలెక్టరేట్ కూడలికి చేరుకుంటారు. 6నుంచి 7.30వరకు అక్కడి బహిరంగ సమావేశంలో పాల్గొంటారు.



మహిళా గళం సభకు హాజరైన మహిళలు

# కూటమితోనే అభివృద్ధి

● మహిళా సంక్షేమానికి ప్రాధాన్యం ● ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో అక్రమాలు ● మహిళాగళం వేదికపై టీడీపీ అధినేత చంద్రబాబు

(విజయనగరం, ఆంధ్రజ్యోతి)

కూటమి అభ్యర్థుల గెలుపుతోనే ఈ ప్రాంత అభివృద్ధి ఆధారపడి ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గజపతి నగరం నియోజకవర్గం బొండపల్లిలో మంగళవారం నిర్వహించిన మహిళాగళం సభలో ఆయన ప్రసంగించారు. మహిళల కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన విష యాన్ని గుర్తుచేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను, హత్యలను, వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. దిశా పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం మహిళల పై జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయలేక పోయిందన్నారు. స్టేషన్లు ఏర్పాటు ముఖ్యంకాదని అరాచకాలకు అడ్డుకట్ట వేసే ఆలోచనలు అవసర మని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో అనేక ఇబ్బందులు ఉన్నాయని, పట్టాదారు పాసుపుస్తకం బదులు ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే హక్కులు ఉంటాయని, అరాచకాలకు కావాల్సిన చట్టాలను తీసుకువచ్చి ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తున్నా రన్నారు. భూములపై వైసీపీ నాయకులు పూర్తిగా పెత్తనాన్ని సాగించా లని తప్పుడు విధానాలు అవలంభిస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర ధరలు తగ్గిస్తామన్నారు. విద్యుత్, ఇంటి అద్దెలు, ఆర్టీసీ చార్జీలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జె బ్రాండ్ మద్యాన్ని వైసీపీ నాయకులే తయారు చేసి రూ.60 విలువ చేసే దానిని రూ.200కు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మహిళలను లక్షా ధికారులను చేస్తానన్నారు. తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను తిరిగి అమల్లోకి తెస్తామని, మహిళల జీవన ప్రమా ణాలు పెంచి సమాజంలో మరింత గౌరవాన్ని పెంచేలా చేస్తామన్నారు. ఎటువంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేకుండా పార్టీలో సాధారణ కార్యకర్తగా రాజకీయ ఆరంగేట్రం చేసిన కలిశెట్టి అప్పలనాయుడికి ఎంపీ టిక్కెట్‌ను అందించామని, టీడీపీలో కార్యకర్తలకు ఎంతటి గౌరవం లభిస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవాలని కోరారు. యువత ప్రాధాన్యాన్ని కూడా పెంచామని చంద్రబాబు వెల్లడించారు. అనంతరం సమావేశానికి హాజరైన మహిళలతో మాట్లాడించారు.



వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



టీడీపీ పాటలకు మహిళల నృత్యం

### ఇంటికి వెళ్లనీయకుండా కంచె వేశారు..



తాము ఇంటికి వెళ్లకుండా వైసీపీ నాయకులు రహదారికి అడ్డంగా కంచె వేసి ఇబ్బందులకు గురి చేశారు. టీడీపీ అభిమానులమని ఇబ్బందులు పెట్టారని విజయనగరానికి చెందిన పైడితల్లి వాపోయింది. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీపరమైన అంశాలను దృష్టిలో వుంచుకుని వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, ఇది అనైతికమని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇటువంటి వాటిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

-పైడితల్లి

### ఊరు చిన్నది.. దౌర్జన్యాలు పెద్దవి



తమది చిన్న గ్రామమని, అయినా దౌర్జన్యాలు, అరాచకాలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని విజయనగరం సమీప ఓ గ్రామానికి చెందిన నాగేశ్వరీ ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఇంజనీరింగ్ చదువుకున్నానని చెప్పింది. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చాక దౌర్జన్యాలపై కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.

-నాగేశ్వరీ

### ఉపాధి కల్పించండి..



తాను ఇంటర్ పూర్తి చేశాను. డాక్టర్ కావాలన్న ఆకాంక్ష ఉంది. కాని ఆర్థిక ఇబ్బందులున్నాయని విద్యార్థిని అనిత చెప్పడంతో చంద్రబాబు స్పందిస్తూ తాము అధికారంలోకి వస్తే ఆర్థికంగా వెసులుబాటు కల్పించి ఉద్యోగాలు పొందిన తరువాత రుణం తీర్చుకునే అవకాశం కల్పిస్తామన్నారు. చదువుపై ఆసక్తి ఉండి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే పేద విద్యార్థులను ఆదుకుంటామని బాబు ప్రకటించారు.

- అనిత, విద్యార్థిని

# మా భూమిని ఎమ్మెల్యే కబ్జా చేశారు..

● చంద్రబాబు ఎదుట కన్నీరు పెట్టిన మహిళ



**గజపతినగరం:** 'మా భూములు ఎమ్మె ల్యే బొత్స అప్పలనరసయ్య కబ్జా చేశారు. మాకు న్యాయం చేయండి' అంటూ గజపతి నగరం శివారు గ్రామం అంజిపురానికి చెందిన సుబ్బలక్ష్మి ప్రజాగళం సభలో చంద్రబాబుకు మొర పెట్టుకున్నారు. మామగారు ఆస్తి తమ పేరున లేకుండా రికార్డులు మార్చేశారని కన్నీరుపెట్టింది. రెండు సంవత్సరాలుగా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయింది. భర్త అనారోగ్యంపాలై వారం రోజులుగా ఆసుపత్రిలో ఉండగా పొలం దున్ని కంచె వేసారని, అక్కడ ఎవరిని అడిగినా ఎమ్మెల్యే పేరు చెబుతున్నారని, రెండేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నా మని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ 'ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దు. రాష్ట్రవ్యాప్తంగా ఈసమస్య ఉంది. కూటమి అధికారంలోకి వచ్చాక మిమ్మల్ని ఇబ్బంది పెట్టిన వారిని బొక్కలో వేస్తాం. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే ఊరుకొక గొడ్డలిని జగన్ పంపిస్తాడు. తస్మాత్ జాగ్రత్త. కూటమి అధికారంలోకి వచ్చాక మీ భూములు మీకు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం' అని భరోసా ఇచ్చారు.

# బిజీగా బాబు

● టీడీపీ అధినేత సమక్షంలో మరిన్ని చేరికలు

● కలిసివచ్చిన గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేప నాయుడు

శృంగవరపుకోట, ఏప్రిల్ 23

● శృంగవరపుకోట దేవిబొమ్మ కూడలిలో సోమవారం రాత్రి నిర్వహించిన ప్రజాగళం సభ ముగింపు అనంతరం స్థానిక శిరికి రిసార్ట్స్‌కు చేరుకున్న టీడీపీ అధినేత చంద్రబాబును కొత్తవలస మండలానికి చెందిన ఎంపీటీసీలు, నాయకులు కలిశారు. పార్టీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాజు ఆధ్వర్యంలో వారంతా టీడీపీలో చేరారు.



ఎస్.కోటలో చంద్రబాబు సమక్షంలో పార్టీలోకి చేరికలు

● రిసార్ట్స్‌లో బసచేసిన చంద్రబాబును కలిసేందుకు సోమవారం రాత్రి గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేప నాయుడు తన అనుచరవర్గంతో వచ్చారు. అప్పటికే ఆయన బస్సులోకి వెళ్లిపోవడంతో వెనుతిరిగారు. మళ్లీ మంగళవారం ఉదయం వచ్చాక చంద్రబాబు తన కారులో ఎక్కించుకున్నారు. గేటు వద్దకు వెళ్లేటప్పటికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా వచ్చారు. కోళ్ల లలితకుమారి దిగి గంటా శ్రీనివాసరావుకు చోటిచ్చారు. వీరితో చంద్రబాబు హెలీపాడ్ వరకు తీసుకువెళ్లారు. అక్కడ నుంచి గజపతినగరం ప్రజాగళం సభకు హెలీకాప్టర్‌లో వెళ్లారు. కాగా గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కేప నాయుడు టీడీపీకి రాజీనామా చేస్తున్నట్లు రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఆయన అధినేతను కలవడంతో పాటు ప్రజాగళం సభకు హాజరుకావడంతో పార్టీ మారడం ఉత్తిదే అని తేలిపోయింది.

చంద్రబాబు సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం 11గంటల వరకు జిల్లాతో పాటు పక్క జిల్లా నేతలతో బిజీగా గడిపారు. విశాఖ నుంచి గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, అనకాపల్లి జిల్లా జిల్లా చోడవరం టీడీపీ మాజీ ఇన్‌చార్జీ తాతాబ్బాయ్, పాడేరు నియోజకవర్గం నుంచి కూడా ముఖ్యనేతలు కలిసేందుకు వచ్చారు. వారందరినీ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చిఅప్పలరామ ప్రసాద్‌లు రిసార్ట్స్‌లోకి ఆహ్వానించారు. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైతం వచ్చి ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు.



మండుటెండలో నడుచుకుంటూ చంద్రబాబు సభకు వస్తున్న మహిళలు

### మండుటెండను సైతం లెక్కచెయ్యకుండా..

**విజయనగరం(ఆంధ్రజ్యోతి):** చంద్రబాబును చూసేందుకు, ఆయన ప్రసంగం వినేందుకు బొండపల్లి మహిళలు ప్రజాగళం సభకు పోటెత్తారు. బస్సులు లేకపోయినా స్వీయ ఖర్చులతో కొద్దిదూరం ఆటోల్లో వచ్చి అనంతరం కాలినడకన వేదిక వద్దకు చేరుకున్నారు. యువతులు, వృద్ధులు సైతం బారులు తీరారు. ఓ వైపు భానుడు భగభగ మంటూ నిప్పులు కక్కుతున్నా లెక్కచేయలేదు. బస్సులు లేక ప్రయాస పడి వచ్చినా సభ చివరకు వరకు వేదికను వీడలేదు.

### అంతా ఒక్కటయ్యారు..

(విజయనగరం, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ తరపున టిక్కెట్లు లభించని నాయకులు శాంతించారు. అధినేతతో మాట్లాడాక తాము కూడా పార్టీతో కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకున్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షునిగా, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కిమిడి నాగార్జునతో చంద్రబాబు మంగళవారం కొద్దిసేపు మాట్లాడారు. భవిష్యత్తులో రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని, అసంతృప్తి వీడి కళా వెంకటరావు గెలుపునకు కృషి చేయాలని చంద్రబాబు కోరినట్టు సమాచారం. దీనిపై మెట్టు దిగిన నాగార్జున గజపతినగరంలో జరిగిన మహిళాగళం కార్యక్రమానికి హాజరై తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. వేదికపై నాగార్జున మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు మంచి జరగాలంటే చంద్రబాబు వంటి విజన్ వున్న నాయకుడు అవసరమని చెప్పారు. కాగా మాజీ ఎమ్మెల్యే కేప నాయుడుతో కూడా చంద్రబాబు ఎస్.కోటలో ప్రత్యేకంగా మాట్లాడారు. భవిష్యత్‌కు స్పష్టమైన హామీ ఇవ్వడంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేందుకు నాయుడు నిర్ణయించుకున్నారు. మహిళాగళం కార్యక్రమానికి కేప నాయుడుకూడా హాజరయ్యారు. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తామన్నారు. దీంతో రెండు నియోజకవర్గాల్లో తలెత్తిన అసమ్మతి సెగలు చల్లారినట్లయింది.

# హామీలు మర్చిపోయారు

● సిద్ధం సభలో చప్పగా జగన్ ప్రసంగం

● జిల్లా సమస్యలు ప్రస్తావించని సీఎం

● పెదవి విరిచిన వైసీపీ శ్రేణులు, ప్రజలు

(విజయనగరం, ఆంధ్రజ్యోతి)

ప్రజా సమస్యలను ఏ కోశానా ప్రస్తావించకుండా సీఎం జగన్ మంగళవారం సిద్ధం సమావేశం నిర్వహించారు. గతంలో తాను ఇచ్చిన హామీలనూ మర్చిపోయారు. వాటి గురించి ప్రస్తావిస్తే అసంతృప్తి మరింత పెల్లుబుకుతుంది అనుకున్నారేమో. సంక్షేమ పథకాలపై చెప్పిందే చెబుతూ ప్రసంగాన్ని కొనసాగించారు. దీంతో చాలా మంది ఆదిలోనే వెనుతిరగడం కన్పించింది. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు, తాగునీటి ఇబ్బందులు.. ప్రాజెక్టుల పరిస్థితులు తదితర అంశాలేవీ ప్రస్తావించలేదు. విమానాశ్రయ పనులు జరుగుతున్నట్టు చెప్పుకొచ్చారు. అసలు ప్రారంభమే కాలేదు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో రోడ్లు గోతులమయం అయ్యాయి. వీటికి మరమ్మతులు చేద్దామని కూడా చెప్పలేదు. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించడానికే ఎక్కువ సమయాన్ని కేటాయించారు. 130 సార్లు బటన్ నొక్కి రూ.2లక్షల 70 వేల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో వేసినట్టు చెప్పుకొచ్చారు. జిల్లాలోని కొంత మంది ఎమ్మెల్యేలు సెటిల్‌మెంట్లు, భూ దందాలు, ఇసుక మాఫియాకు అండదండలు అందిస్తున్నారు. అయితే ఎన్నికల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థులను జగన్ పరిచయం చేస్తూ సౌమ్యులు, మంచివారు, మనసు వెన్నవంటిదని చెబుతున్నప్పుడు అందరూ నవ్వుకోవడం కన్పించింది.

● సిద్ధం సమావేశాన్ని అంతర్రాష్ట్ర రోడ్డు మార్గంలో చెల్లూరు వద్ద ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 6.30 గంటల వరకూ ట్రాఫిక్‌ను నియంత్రించారు. కాగా సీఎం కాన్వాయ్ వస్తుండగా ఓ వ్యక్తి రోడ్డుకి అడ్డుగా పడుకున్నాడు. వెంటనే సీఎం సెక్యూరిటీ పక్కకు లాగేశారు. అనంతరం అతన్ని పోలీసు వాహనంలో ఎక్కించి తీసుకుపోయారు.



సభ జరుగుతుండగా ఆదిలోనే వెనుతిరిగిన ప్రజలు

### కస్సు.. 'బస్సు'

**విజయనగరం రింగురోడ్డు/ రాజాం/ బొబ్బిలి:** సీఎం జగన్ ఎక్కడ సిద్ధం సభ నిర్వహించినా సమీప జిల్లాల ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. కొంతకాలంగా ఇదే తంతు జరుగుతోంది. ఇప్పుడు మన జిల్లా వంతు వచ్చింది. విజయనగరం సమీపంలోని చెల్లూరు వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన సభకు దాదాపు బస్సులన్నీ కేటాయించారు. దీంతో ప్రయాణికుల బాధలు వర్ణనా తీతంగా మారాయి. విజయనగరం డిపో నుంచి 90, ఎస్.కోట నుంచి 40 బస్సులు తరలించేశారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ రోజంతా బోసిపోయింది. బస్సుల కేటాయింపు విషయం తెలియని కొందరు కాంప్లెక్స్‌కు వచ్చి చాలాసేపు నిరీక్షించి వెళ్లడం కనిపించింది.

● రాజాం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక్క బస్సు కూడా రాలేదని వంగర మండలం దేవకివాడ గ్రామానికి చెందిన రాంబాబు ఆవేదన వ్యక్తం చేశాడు.

● పార్వతీపురం, సాలూరు ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను సీఎం సభకు తరలించడంతో బొబ్బిలి కాంప్లెక్స్‌లో ప్రయాణికులు గంటలకొద్దీ నిరీక్షించారు.



పీపుల్స్ మేనిఫెస్టో

## రైతులను ఆదుకోవాలి



**సాలూరు రూరల్:** ఎన్నికల్లో రైతులకు ఆశ చూపిస్తారు. ఎన్నికలు ముగిసిన తరువాత అన్నదాతకు చుక్కలు చూపించడం పరిపాటిగా మారింది. రైతు ప్రభుత్వంగా చెప్పుకొని విస్మరించడం తగదు. రైతులకు అన్ని విధాలుగా మేలు చేయాలి. భవిష్యత్‌లో ఆహార సంక్షోభం రాకుండా ఉండాలంటే రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలి.

- ఖూస తవుడు, రైతు, మామిడిపల్లి


## సిరా గుర్తు వేసేందుకు చూపుడు వేలు లేకపోతే..!

మీకు తెలుసా?

**కొమరాడ:** సాధారణంగా ఓటు వేసే వారికి పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎడమ చేతి చూపుడు వేలికి సిరా గుర్తు వేస్తారు. రెండోసారి ఓటేయడానికి రాకుండా ఉండేందుకు ఇలా చేస్తారని అందరికీ తెలిసిన విషయమే. మరి ఆ వేలు లేని వారి పరిస్థితి ఏమిటంటే చాలా మందికి తెలియదు. ఎడమ చేయి చూపుడు వేలు లేని ఓటర్ల విషయంలో భారత ఎన్నికల సంఘం కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలికి సిరా గుర్తు వేయవచ్చు. అది కూడా లేకపోతే మధ్య వేలికి, అదీ లేకపోతే ఉంగరం వేలికి, అదీ లేకపోతే చిటికెన వేలికి, చివరకు నాలుగు వేళ్లు లేకపోతే బొటన వేలికి సిరా గుర్తు పెడతారు. ఇదే క్రమంలో సిరా గుర్తు వేస్తారు. రెండు చేతులకు వేళ్లు లేకపోతే ఎలా అంటే? వేళ్ల మొదలు... లేదా మధ్య భాగం లేదా చేతిపై గుర్తువేస్తారు. భుజాల వరకు చేతులు లేని ఓటర్లకు ఎడమ చెంపపై సిరా గుర్తు పెడతారు.

## ఎవరికి ఓటు వేశామో తెలుసుకోవచ్చు..

**కొమరాడ:** ఈవీఎంలో మనం ఎవరికి ఓటు వేశామో చూసుకోవచ్చు. నచ్చిన అభ్యర్థికి... పార్టీకి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ఓటరు వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా కల్పిస్తోంది. వేసిన ఓటును చూసుకునే అవకాశం ఏడు సెకన్ల వరకు మాత్రమే ఉంటుంది. అనంతరం ఆ ఓటు వీవీ ప్యాడ్ బాక్స్‌లో పడిపోతుంది. ఈ విధానాన్ని తొలిసారిగా 2013 సెప్టెంబరులో నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాలలో అమలు చేశారు. ఆ తరువాత దశల వారీగా అంతటా అమల్లోకి వచ్చింది. వేసిన ఓటును సెల్‌ఫోన్ ద్వారా చిత్రీకరించడం... బహిర్గతం చేయడం మాత్రం నిషేధం. ఉల్లంఘిస్తే ఓటు రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది.



# ఇవి రోడ్లంటారా?

పార్వతీపురం మన్యం జిల్లా రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గొయ్యి ఏర్పడడంతో వాహన చోదకులు...ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం రహదారుల మరమ్మతులను పూర్తిగా విస్మరించడంతో అధ్వానంగా తయారయ్యాయి. వాహనాల రాకపోకలకే కాదు... కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి.



గరుగుబిల్లి: పెద్దూరు సమీపంలో పాడైపోయిన రోడ్డు

- అధ్వానంగా రహదారులు
- అవస్థలు పడుతున్న మన్యం జిల్లా ప్రజలు
- ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

(పార్వతీపురం రూరల్)

వైసీపీ పాలనలో రహదారులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలంటే పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తే చాలు. ఎక్కడికక్కడ రాళ్లు తేలి...గోతులతో దారుణంగా కనిపిస్తున్నాయి. జిల్లా కేంద్రం పార్వతీపురం సమీపంలో ఉన్న వెంకంపేట గోలీలు వద్ద రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. వెంకంపేట గోలీల నుంచి ఒడిశా సరిహద్దు వరకు వెళుతున్న రహదారి అనేక ప్రాంతాల్లో గోతులమయమైంది. వెంకంపేట రామందిరం వద్ద రహదారి పరిస్థితి చూస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. చిన్నబొండపల్లి గ్రామ శివారు ప్రాంతంలో బ్రిడ్జి వద్ద రహదారి పూర్తిగా పాడైపోయింది. ఎంఆర్ నగరం గ్రామ ప్రవేశ ద్వారం వద్ద రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఏ గ్రామానికి వెళ్లినా రోడ్లు శిథిలావస్థలోనే కనిపిస్తున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో రహదారులను పూర్తిగా విస్మరించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా ఈ రోడ్డును పట్టించుకోకపోవడంపై సర్వత్రా మండిపడుతున్నారు.





వెంకమ్మపేట జంక్షన్ వద్ద రహదారి దుస్థితి

### వెళ్లలేకపోతున్నాం

వెంకంపేట గోలీల నుంచి ఆర్అండ్‌బీ రహదారిపై ప్రయాణం చేయాలంటే నరకమే కనబడుతుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలిసిపోయే పరిస్థితి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులను పట్టించుకోపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

- కె.శ్రీనివాసరావు, పార్వతీపురం

### ఇబ్బంది పడుతున్నారు..

రహదారులు గోతుల మయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకొనే పరిస్థితి నియోజకవర్గంలో కనిపించడం లేదు. చిన్నబండపల్లి ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది.

- అప్పలనాయుడు, పార్వతీపురం మండలం

### ఒడిశా రహదారులే నయం

వెంకంపేట గోలీల నుంచి ఆంధ్రా సరిహద్దు ప్రాంతం వరకు రహదారుల పరిస్థితి దారుణంగా ఉంది. ఆంధ్రా సరిహద్దు నుంచి ఒడిశా రోడ్లు చాలా బాగున్నాయి. మన రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొంది.

- ఆర్.అనిల్, పార్వతీపురం మండలం

### అడుగుకో గొయ్యి

**గరుగుబిల్లి:** మండల కేంద్రం గరుగుబిల్లి నుంచి బీవీ పురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గరుగుబిల్లి నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల మేర అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నిర్మించిన రహదారికి ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించేవారు నరకయాతన అనుభవిస్తున్నారు. పెద్దూరు చెరువుకు ఆనుకుని ఉన్న రహదారి అత్యంత దారుణంగా తయారైంది. ఏ మాత్రం అదుపు తప్పినా ఒకవైపు చెరువు, మరోవైపు లోతైన పంట పొలాలు ఉన్నాయి. ఈ మార్గంలో చీకటి పడిందంటే తిప్పలు తప్పవు. రహదారి సమస్యపై పలు దఫాలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం కాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం గుండా బలిజిపేట, సీతానగరం మండలాలతో పాటు వివిధ గ్రామాల వారు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి...అధికారంలోకి వచ్చిన తరవాత సమస్యలను విస్మరించడం కురుపాం నియోజకవర్గంలో ఆనవాయితీగా మారిందని అధికార పార్టీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో చిలకాం, శివ్వాం, కొత్తూరు, రావుపల్లి, సన్యాసిరాజుపేట, కొంకడివరం, రావివలస, నాగూరుతో పాటు వివిధ గ్రామాల రహదారులు దయనీయంగా దర్శనమిస్తున్నాయి.





భామిని: రాళ్లు తేలిన యాతంగూడ, మూలగూడ రహదారులు

### ఆదివాసీలకు కష్టాలు

**భామిని:** మండలంలోని తివ్వకొండపైన గ్రామాలు, దిగువున ఉన్న గ్రామాలకు పక్కా రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అధికారులు, గిరిజనుల కోరిక మేరకు ఏవి కావాలన్నా అమలు చేస్తామని వాగ్దానాలే తప్ప ఆచరణ కనిపించడం లేదు. ఈ నాలుగేళ్లలో లింకు రోడ్లు నిర్మించి అర్థాంతరంగా నిలిపివేయడంతో కాలినడకన వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఏబీ రోడ్డు లివిరి నుంచి మూలగూడ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారి పూర్తిగా రాళ్లు తేలిపోయింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బొడ్డగూడ రోడ్డు నుంచి యాతంగూడ, సన్నాయికాలనీ రహదారులకు మెటల్స్, చిప్స్ వేసి వదిలిపెట్టారు. బురుజోల పంచాయతీ మంద్రుంగూడ, కొత్తగూడ, వడ్డంగి పంచాయతీ జియ్యమానుగూడ రహదారి కూడా అధ్వానంగా మారింది. చిప్స్, మెటల్ వేసి విడిచిపెట్టడంతో గేదెలగూడ, డోకులగూడ, యాతంగూడ గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొండ శిఖరాన ఉన్న కోటకొండ, కోసింగూడ గ్రామాలకు కోసిమానుగూడ నుంచి రోడ్డు వేయడానికి ఎర్త్ వర్క్ చేసి విడిచిపెట్టడంతో ఆ రోడ్డు వర్షాల వల్ల కూరుకుపోయి రాళ్లు తేలి నడిచేందుకు వీలు లేకుండాపోయింది. గిరిజనులకు అనారోగ్య సమస్యలు ఏర్పడితే ఆసుపత్రులకు వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

## బి.ఫారం అందుకున్న బేబీనాయన

**బొబ్బిలి:** బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి ఎన్డీఏ కూటమి తరఫునఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) మంగళవారం తమ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నుంచి పార్టీ బి.ఫారం అందుకున్నారు. ప్రజాగళం సభలో పాల్గొనేందుకు గజపతినగరం విచ్చేసిన చంద్రబాబును బేబీనాయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన ఆశీర్వాదంతో పాటు బి.ఫారం కూడా అందుకున్నారు. ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బాడంగి మండల టీడీపీ సీనియర్ నాయకుడు ఆవు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నుంచి బీ ఫారం అందుకుంటున్న బేబీనాయన

పెద్దల మాట

## నాడు సామాన్యులకు పదవులు.. నేడు ధనవంతులకే అవకాశం

**శృంగవరపుకోట రూరల్:** మేం యుక్త వయసులో ఉన్నపుడు సామన్యులకు పదవులు వచ్చేవి. ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బులు ఉన్న వారికే అధికారం అందుతోంది. నాటి ఎన్నికల సమయంలో వచ్చే నాయకులు తమకు ఓటు వేయాల్సిందిగా కోరేవారు. అభ్యర్థి మంచివారైతే మేమే రూపాయి నుంచి రూ.ఐద వరకు సాయంగా ఇచ్చేవాళ్లం. నేడు ఓటు అమ్ముకునే దుస్థితికి చాలా మంది వచ్చారు. నాడు ఆరోగ్యవంతమైన రాజకీయం..నేడు అంతా అస్తవ్యస్తం. అప్పుడు రంగుల కాగితాలు ఇస్తే మాకు నచ్చిన అభ్యర్థికి అట్ట పెట్టెల్లో వేసేవాళ్లం. మంచి అభ్యర్థి అయితే ఆయన తరఫున మేమే స్వచ్ఛందంగా ప్రచారం చేసేవాళ్లం. 1994లో మండల వ్యవస్థ ఏర్పడిన తరువాత నన్ను జడ్పీటీసీగా పోటీ చేయించి... గెలిపించారు. ఇప్పుడు అలాంటి రోజులు లేవు. 1951లో మా ధర్మవరం గ్రామానికి ఎంతో నిరాడంబరంగా అప్పటి వ్యవసాయశాఖ మంత్రి ఎన్‌జీ రంగా వచ్చి మొట్టమొదటిగా వీధి దీపాలు ప్రారంభించిన రోజు ఇంకా గుర్తుంది. ఆ హుందాతనం నేడు ఎవరికీ లేదు.

- అల్లు సూర్యనారాయణమ్మ (84)
మాజీ జడ్పీటీసీ, ధర్మవరం



## కాంగ్రెస్ అభ్యర్థికి విమానం గుర్తు!

- 1985 ఎన్నికల్లో వింత సంఘటన

ఎన్నెన్నో

**చీపురుపల్లి:** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ హస్తం గుర్తును కేటాయిస్తుంది. పార్లమెంటుకు, లేదా రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలకు గానీ ఆ పార్టీ తరఫున పోటీ చేసే వారిది హస్తం గుర్తే. కానీ దీనికి భిన్నంగా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985లో కాంగ్రెస్ తరఫున ఎన్నికల్లో నిలిచిన అప్పటి అభ్యర్థి మీసాల నీలకంఠంనా యుడుకు ఒక వింత అనుభవం ఎదురైంది. జాతీయ కాంగ్రెస్ తరఫున బరిలో ఉన్న ఆయనకు హస్తం గుర్తుకు బదులుగా విమానం గుర్తుపై పోటీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. 1985లో తెలుగుదేశం పార్టీలో తలెత్తిన సంక్షోభం కారణంగా అప్పటి సీఎం ఎన్టీఆర్ పక్కకు తప్పుకోవలసి వచ్చింది. 1983లో ఏర్పాటైన అసెంబ్లీని రద్దు చేసి, మధ్యంతర ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున కెంబూరి రామ్మోహనరావు పోటీకి నిలబడ్డారు. ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరఫున మీసాల నీలకంఠంనాయుడు పోటీకి దిగారు. అప్పట్లో పార్టీలో నెలకొన్న అంతర్గత కారణాల వల్ల నీలకంఠంనాయుడుకు టికెట్ కేటాయించడంలో కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడింది. ఆఖరి నిమిషంలో ఆయనకు బీ ఫారం పంపించింది. అయినప్పటికీ కాంగ్రెస్ తరఫున నీలకంఠంనాయుడు సకాలంలో బీ ఫారం అందించలేకపోయారు. గడువు లోపల ఆయన పార్టీ బీ ఫారం ఆర్వోకు సమర్పించలేకపోవడంతో చివరి నిమిషంలో ఆయనను స్వతంత్ర అభ్యర్థిగా పరిగణిస్తూ ఎన్నికల కమిషన్ విమానం గుర్తు కేటాయించింది. ఆయన నూటికి నూరుపాళ్లూ కాంగ్రెస్ అభ్యర్థి అయినప్పటికీ, ఆ పార్టీ తరఫున ప్రచారం చేసుకొనే అవకాశం దక్కలేదు. దీంతో విధి లేని పరిస్థితుల్లో ఆయన తాను ఏర్పాటు చేయించిన క్లాత్ బ్యానర్లపై తన పేరుకు ఒక వైపున హస్తం గుర్తు, మరోవైపున విమానం గుర్తు ముద్రించి ప్రచారం చేసుకోవలసి వచ్చింది. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థి కెంబూరి రామ్మోహనరావుకు 45,349 కోట్లు పోలవ్వగా... నీలకంఠంనాయుడుకు కేవలం 13,052 ఓట్లు మాత్రమే వచ్చాయి.



మీసాల నీలకంఠంనాయుడు

సెంటిమెంట్

## అక్కడ బాబు సభ పెడితే... విజయమే!



సోమవారం రాత్రి దేవిబొమ్మ కూడలిలో ప్రజాగళం సభ

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట దేవి బొమ్మ కూడలి వద్ద టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారం చేసిన ప్రతిసారీ ఆ పార్టీ అభ్యర్థి గెలుస్తారన్న సెంటిమెంటు ఉంది. 2009, 2014 సార్వత్రిక ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి కోసం ఇక్కడే ఎన్నికల ప్రచారం నిర్వహించడంతో విజయం సాధించారని చెబుతున్నారు. సోమవారం కూడా ఇక్కడే ప్రజాగళం సభ నిర్వహించడంతో ఈ దఫా తప్పక గెలుస్తారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

## టీడీపీ తరఫున మాజీ సైనికుడి ప్రచారం

**పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా విజయవాడకు చెందిన మాజీ సైనికుడు ఎం.శంకరరావు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ అభ్యర్థులకు తన మద్దతు తెలియజేస్తూ పత్రాలు అందజేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజలను మాజీ సైనికుడు కలుస్తూ రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో అవసరమని చెబుతున్నారు. టీడీపీ, జనసేన, ఉమ్మడి అభ్యర్థి విజయచంద్రను మంగళవారం కలిసి మద్దతు తెలిపే పత్రాన్ని శంకరరావు అందించారు.



కూటమి అభ్యర్థి విజయచంద్రకు పత్రాలను అందిస్తున్న శంకరరావు

## పోలింగ్ కేంద్రాలు మూడు రకాలు

**కొమరాడ:** ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలను మూడు రకాలుగా విభజించారు. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రం.. రెండోది సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రం... మూడోది అతి సున్నితమైన పోలింగ్ కేంద్రం. రాజకీయ నాయకుల అనుచరులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దూషించుకోవడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్, గొడవలు, ఇతరేతర సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ విధమైన విభజన జరిగింది. సాధారణ పోలింగ్ కేంద్రం కంటే అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రం వద్ద భద్రత ఎక్కువగా ఉంటుంది. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఇలాంటి వాటిని ఇప్పటికే గుర్తించి జియో ట్యాగింగ్ చేసి ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసి ఉంటారు. వీటి ఆధారంగా ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తుంటారు.

జన కేతనం
ఆంధ్రజ్యోతి బుధవారం 24 ఏప్రిల్ 2024

# గిరిజన బాంధవుడు.. ఎన్టీఆర్



పాలకొండ నియోజకవర్గ ముఖచిత్రం

- ఐటీడీఏలతో ఎంతో మేలు
- ఏజెన్సీ ముఖద్వారం పాలకొండ నియోజకవర్గం
- 80 శాతానికి పైగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలే
- టీడీపీ వైపు పల్లెల చూపు

**ఎక్కడో విసిరేసినట్టు ఉండే పల్లెలు...నాగరిక ప్రపంచానికి దూరంగా జనం. అటవీ ఉత్పత్తులపై వచ్చే అరకొర ఆదాయం. దళారుల చేతిలో మోసపోవడం..ఇదీ కొన్ని దశాబ్దాల కిందట అమాయక గిరిజనుల జీవనచిత్రం. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక వీరి జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయి. ఐటీడీఏలకు రూపకల్పనతో గిరిజనుల జీవన చిత్రాన్ని సమూలంగా మార్చేశారు. ఇప్పుడు ఐటీడీఏల ద్వారా వారికి అందుతున్న ఫలాలు ఎన్టీఆర్ చలువే. పాలకొండ నియోజకవర్గంలో అత్యధిక శాతం గిరిజనులు నిరంతరం ఎన్టీఆర్‌ను తలచుకుంటూనే ఉంటారు.**

(పాలకొండ)

పాలకొండ నియోజకవర్గం ఏజెన్సీకి ముఖద్వారం. అటు ఏజెన్సీ ప్రాంతం, ఇటు మైదాన ప్రాంతం కలబోసి పాలకొండ నియోజకవర్గం. 1952లో ఈ అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి నుంచి వివిధ పార్టీల అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించారు. ఈ నియోజకవర్గ పరిధిలో సీతంపేట, వీరఘట్టం, పాలకొండ, భామిని మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ఇప్పటికీ 80 శాతం వ్యవసాయ ఆధారిత కుటుంబాలే. సీతంపేట ఏజెన్సీలోని గిరిజనులు అటవీ ప్రాంతంలో వివిధ రకాల అటవీ ఉత్పత్తులను సేకరించి.. అమ్మకాలు చేయడంతో పాటు వాణిజ్య పంటలపై ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తున్నారు. మైదాన ప్రాంతాల్లో ప్రజానీకం వంశధార, నాగావళి నదుల మధ్య ఉండడంతో ఆ నదుల నీటితో పాటు కొండ వాగులు, గెడ్డల ద్వారా వచ్చే నీటితో పంటలను పండించి జీవనాధారం పొందుతున్నారు. నాగావళి, వంశధార నదులు చెంతనే ఉన్నప్పటికీ పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు పూర్తిస్థాయిలో సాగునీరు, తాగునీరు అందుతున్న దాఖలాలు లేవు. పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుత అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉంది. ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉన్న ఈ నియోజకవర్గం ఇటీవల జిల్లాల పునర్విభజనలో పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోకి వెళ్లింది. పాలకొండ నియోజకవర్గ కేంద్రం తొలినాళ్లలో పంచాయతీగా ఉండేది. ఆ తర్వాత మేజర్ పంచాయతీగా.. ప్రస్తుతం నగర పంచాయతీగా కొనసాగుతోంది. డివిజన్ కేంద్రంగా ఉన్నప్పటికీ ఆ స్థాయిలో సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని.. దీని వల్లనే పునర్విభజనలో పాలకొండ జిల్లా కేంద్రంగా రూపుదిద్దుకోలేకపోయిందని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాలకొండ పట్టణం

### 1952 నుంచి ఇలా..

1952లో పాలవసల సంగంనాయుడు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థి ఏఆర్ నాయుడుపై గెలుపొందారు. 1955లో పైడి నర్సింహ అప్పారావు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి.. మరో ఇండిపెండెంట్ అభ్యర్థి కేఎస్ నాయుడుపై విజయం సాధించారు. 1962లో కేఎస్ నాయుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పైడి ఎ నర్సింహ అప్పారావుపై గెలిచారు. 1967లో జె.జోజి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి కె.నరసయ్యపై గెలుపొందారు. 1972లో కె.నరసయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి.. ఇండిపెండెంట్ అభ్యర్థి జమ్మయ్యపై విజయం సాధించారు. 1978లో జనతా పార్టీ నుంచి కె.రాజరత్నం పోటీ చేసి.. కాంగ్రెస్(ఐ) అభ్యర్థి డి.ఆదినారాయణపై గెలుపొందారు. 1983లో టీడీపీ అభ్యర్థి శ్యామరావు... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జె.లచ్చయ్యపై విజయం సాధించారు. 1985లో టీడీపీ నుంచి తలే భద్రయ్య పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పీజే అమృతకుమారిపై గెలుపొందారు. 1989లో కాంగ్రెస్(ఐ) తరఫున పోటీ చేసిన పీజే అమృతకుమారి... టీడీపీ అభ్యర్థి జి.సత్తెయ్యపై గెలుపొందారు. 1994లో టీడీపీ అభ్యర్థి తలే భద్రయ్య.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పీజే అమృతకుమారిపై గెలిచారు. 1999లో ఇండిపెండింట్ అభ్యర్థిగా పోటీ చేసిన పీజే అమృతకుమారి... టీడీపీ తరఫున పోటీ చేసిన తలే భద్రయ్యపై విజయం సాధించారు. 2004లో టీడీపీ అభ్యర్థి కంబాల జోగులు కాంగ్రెస్ అభ్యర్థి టి.రాంబాబుపై గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి నిమ్మక సుగ్రీవులు టీడీపీ అభ్యర్థి నిమ్మక గోపాలరావుపై గెలుపొందారు. 2014 వైసీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై గెలుపొందారు. 2019లో వైసీపీ తరఫున పోటీ చేసిన విశ్వాసరాయి కళావతి టీడీపీ అభ్యర్థి నిమ్మక జయకృష్ణపై గెలుపొందారు.



సంగంనాయుడు



నరసింహ అప్పారావు



తలే భద్రయ్య



కంబాల జోగులు



నిమ్మక సుగ్రీవులు



పీజే అమృతకుమారి




విశ్వాసరాయి కళావతి

### పాలకొండ అసెంబ్లీ ఎమ్మెల్యేలు వీరే..

| | | |
|---|---|---|
| 1952 | పాలవలస సంగంనాయుడు | కాంగ్రెస్ |
| 1955 | పైడి నరసింహ అప్పారావు | ఇండిపెండెంట్ |
| 1962 | కేఎస్ నాయుడు | ఇండిపెండెంట్ |
| 1967 | జె.జోజి | ఇండింపెండెంట్ |
| 1972 | కె.నరసయ్య | కాంగ్రెస్ |
| 1978 | కె.రాజారత్నం | జనతా |
| 1983 | శ్యామలరావు | టీడీపీ |
| 1985 | తలే భద్రయ్య | టీడీపీ |
| 1989 | టీజే అమృతకుమారి | కాంగ్రెస్ (ఐ) |
| 1994 | తలే భద్రయ్య | టీడీపీ |
| 1999 | టీజే అమృతకుమారి | ఇండిపెండెంట్ |
| 2004 | కంబాల జోగులు | టీడీపీ |
| 2009 | నిమ్మక సుగ్రీవులు | కాంగ్రెస్ |
| 2014 | విశ్వసరాయి కళావతి | వైసీపీ |
| 2019 | విశ్వసరాయి కళావతి | వైసీపీ |

### ఓటర్లు ఇలా..

| | |
|---|---|
| మొత్తం ఓటర్లు | 1,93,667 |
| పురుషులు | 94,328 |
| మహిళలు | 99,325 |
| ఇతరులు | 14 |
| పోలింగ్ బూత్‌ల సంఖ్య | 287 |



### జనరల్ నుంచి ఎస్టీ నియోజకవర్గంగా...

1952లో ఏర్పడిన పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం తొలినాళ్లలో 1952 నుంచి 1955-62 వరకు మూడు సార్లు జనరల్‌గా ఉండేది. 1967లో పునర్విభజనలో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మరింది. అప్పటి నుంచి 2004 వరకు ఎస్సీ నియోజకవర్గంగా కొనసాగింది. 2009 పునర్వభజనలో ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంగా మారింది. అప్పటి నుంచి 2014, 2019.. ప్రస్తుత ఎన్నికల్లో ఎస్టీ రిజర్వుడుగానే కొనసాగుతోంది.

### ఐటీడీఏతో గిరిజనుల్లో చైతన్యం

తెలుగుజాతి గర్వించదగ్గ మహానాయకుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు.. దివంగత నందమూరి తారకరామారావు అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనాభివృద్ధికి పెద్దపీట వేశారు. దీనిలో భాగంగానే 1983లో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా ఉన్న శంకరన్ అధ్వర్యంలో ఐటీడీఏలను ప్రారంభించారు. ఐటీడీఏ అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి గిరిజన ప్రజలు చైతన్యవంతులై హక్కులను పొందారు. అప్పటి నుంచి ప్రత్యేక నిధులు కేటాయించడంతో అమాయక గిరిజనులు అన్నిరంగాల్లో రాణించి పోటీ ప్రపంచంలో పరుగులు పెడుతున్నారు. ఇదంతా ఎన్టీఆర్ కృషి ఫలితమే.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం



వేదికపై చంద్రబాబుతోపాటు కూటమి అభ్యర్థులు, నాయకులు

# బాబును చూడాలని..!

- బారులు తీరిన జనం
- ఎండను లెక్క చేయకుండా ఎదురుచూపులు

**విజయనగరం (ఆంధ్రజ్యోతి)/బొండపల్లి, ఏప్రిల్ 23:** 'ప్రజాగళం' యాత్రకు వచ్చిన చంద్రబాబును చూసేందుకు బొండపల్లి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో వేదిక వద్దకు చేరుకున్నారు. నిర్వాహకులు ఊహించిన సంఖ్య కంటే చాలా ఎక్కువగా మహిళలు సభాప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో చాలా మంది బయట ఉండాల్సి వచ్చింది. 43 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా చంద్రబాబును చూసేందుకు ఆసక్తి చూపారు.



సెల్ఫీ తీసుకుంటున్న యువతి

- సభ జాతీయ రహదారి 23ని ఆనుకుని ఏర్పాటు చేశారు. చంద్రబాబు కాన్వాయ్ వచ్చే సమయానికి భారీగా ట్రాఫిక్ స్తంభించింది.
- మహిళలు కేరింతలు కొట్టడం కనిపించింది. టీడీపీ, బీజేపీ, జనసేన గీతాలకు డ్యాన్సులు చేశారు.
- ఎండ వేడిని తట్టుకునేలా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. ఎయిర్ కూలర్లు, ఫ్యాన్‌లు పెట్టారు. మజ్జిగ, మంచినీరు ఇచ్చి మహిళలు, జనం దాహార్తిని తీర్చారు.
- టిక్కెట్‌లు రాకపోవటంతో కొద్ది రోజులుగా పార్టీకి దూరంగా ఉన్న కిమిడి నాగార్జున, కేఏనాయుడు చంద్రబాబుతో మాట్లాడాక జోష్ తో కనిపించారు.
- వేదికపై కేఏ నాయుడు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు మినహా ఇప్పటివరకు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు.
- జనసేన నాయకుడు ముర్రాపు సురేష్ మాట్లాడుతూ కూటమి గెలుపు.. అభివృద్ధికి మలుపని, మహిళలు ఆర్థికాభివృద్ధి చెందా లంటే కూటమి అభ్యర్థులు విజయం సాధించాలన్నారు.



అశోక్, బేబీనాయన మాటామంతీ..

#### నా ఆశయాన్ని నెరవేర్చండి

'నేను ఇప్పటివరకు విద్యార్థిగా కష్టపడి చదివాను. వైద్య వృత్తిలో స్థిరపడాలని నా ఆశయం, నా తల్లిదండ్రుల కలను మీరే సాకారం చేయాల'ంటూ విద్యార్థిని షర్మిలా గాయత్రి సభలో చంద్రబాబును కోరారు.

#### విద్యకు సహకరించాలి

విద్యా దీవెనను ఇద్దరు పిల్లలకే పరిమితం చేయకుండా ఎందరున్నా సహకారం అందించాలని పురిటిపెంట గ్రామానికి చెందిన తెంటోతు రమాదేవి సభలో చంద్రబాబును కోరారు. ఎంతమంది పిల్లలున్నా విద్యాభివృద్ధికి రూ.15వేల వంతున సహకారం అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

#### చంద్రన్న బీమాతో ఆసరా

మీ పాలనలో చంద్రన్న బీమా ద్వారా రూ.2 లక్షల లబ్ధి పొందాను. మీకు ధన్యవాదాలు తెలిపేందుకే ఇక్కడకు వచ్చానని ముచ్చర్ల గ్రామా నికి చెందిన హైమావతి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



కదిలింది మహిళా లోకం..



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు



ప్రధాని మోదీ మాస్క్‌తో..



సూపర్ సిక్స్ పథకాల కార్డులతో మహిళలు

# కలుషిత నీటితో అనారోగ్యం

● పంచాయతీ తాగునీటిలో తెల్లటి పౌడర్ ● కీళ్ల నొప్పులు వస్తున్నాయంటున్న ప్రజలు

**భోగాపురం:** మండలం తూడెం గ్రామంలో తాగునీరు కలుషితమవడంతో కీళ్ల నొప్పులతో బాధపడుతున్నామని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. తూడెం గ్రామం పచ్చని వాతావరణంలో కొబ్బరితోటల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చూడడానికి ఎంతో అందంగా ఉన్నా ఈ గ్రామం పక్కనే భారీ పరిశ్రమ ఉండడంతో అప్పుడప్పుడూ పరిశ్రమకు సంబంధించిన వాసన విపరీతంగా వస్తుంది. ఇక్కడ సుమారు 3వేలకి పైగా జనాభా నివసిస్తున్నారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం పరిశ్రమకు సుమారు 100 మీటర్ల దూరంలోనే బోరు ఏర్పాటు చేసి అక్కడి నుంచి రక్షిత మంచినీటిని పైపులైన్ల ద్వారా ట్యాంకులకు పంపించి ప్రజలకు అందిస్తున్నారు.

ఇలా ట్యాంకు ద్వారా సరఫరా అయ్యే తాగునీటిని స్థానికులు బిందెల్లో నింపుకుని గృహాల్లో ఉంచుకుంటున్నారు. ఈ బిందెల్లో ఉంచిన తాగునీటిపై తెల్లటి పౌడర్ ఒక పొరలా తేలుతోంది. ఈ నీటిని వేడిచేసి చల్లార్చినా పౌడర్ కనిపిస్తోంది. ఈ నీరు తాగడానికి బాగానే ఉన్నా కలుషితమైనది కావడంతో చాలా మందికి కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. స్థానికంగ ఉన్న పరిశ్రమ కారణంగానే తాగునీరు కలుషితమై, అనారోగ్య సమస్యలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ తాగునీటిని పరీక్షించాలని, ఇకపై ఈ నీరు కలుషితమవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌ను వివరణ కోరగా దీనిపై పరిశీలిన చేస్తామని సమాధానం ఇచ్చారు. ఎంపీడీవో జి.చంద్రకళను వివరణ కోరగా అక్కడ తాగునీటిని పరీక్ష చేయించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



రక్షిత మంచినీటి ట్యాంకు



తాగునీటిలో తేలుతున్న తెల్లటి పొడి

### కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాం

ఇక్కడ ట్యాంకు ద్వారా వచ్చే మంచినీటిని తాగుతున్నాం. అయితే బిందెలో ఉంచిన తాగునీటిపై సుమారు 5 నుంచి 6 గంటల తరువాత చూస్తే తెల్లటి పౌడర్‌లా కనిపిస్తోంది. నీటిని వేడి చేసి చల్చారినా పౌడర్ అలానే ఉంటోంది. బిందెలో గ్లాసు ముంచినా గ్లాసుకు పౌడర్ అంటుకుంటోంది. ఈ సమస్యను పరిష్కరించి ప్రజారోగ్యం కాపాడాలి

-డెక్కతి సునీత, తూడెం గ్రామం

## పార్లమెంటుకు స్థానానికి 6 నామినేషన్లు

**కలెక్టరేట్:** విజయనగరం పార్లమెంటు స్థానానికి మంగళవారం 6 నామినేషన్లు దాఖలయ్యాయి. జిల్లా కలెక్టరు నాగలక్ష్మి తన చాంబర్‌లో పార్లమెంట్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. సమాజ్‌వాదీ పార్టీ నుంచి సామిరెడ్డి అచ్చియ్యనాయుడు, బీఎస్పీ నుంచి పీరుబండి ప్రకాశరావు, స్వతంత్ర అభ్యర్థిగా పీవీఏ ఆనందసాగర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి సఖినేటి అనంతరాజు, జై భీమారావు భారత పార్టీ నుంచి చిన్నం అరుణకుమారి, స్వతంత్ర అభ్యర్థిగా వేలూరి వెంకట త్రినాథరావు, ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు.

● **శృంగవరపుకోట:** శృంగవరపుకోట ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణకు మంగళవారం బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి బోను కృష్ణ నామినేషన్ పత్రాలు అందించారు. ● **రాజాం:** కాంగ్రెస్ అభ్యర్థి కంబాల రాజవర్ధన్ మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. పాలకొండ రోడ్డులో పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీగా వెళ్లి రెండు నామినేషన్ సెట్లను ఆర్వో జోషఫ్‌కు అందజేశారు. ● **జామి:** ఎస్.కోట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలంలోని అలమండ గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యనిపుణులు గేదెల తిరుపతికి పార్టీ అధ్యక్షురాలు షర్మిల మంగళవారం బీఫారం అందించారు. ● **భోగాపురం:** కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి సరగడ రమేష్‌కుమార్‌కు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి మంగళవారం బీఫారం అందజేశారు.

## నేడు లలిత కుమారి నామినేషన్

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట శాసన సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి బుధవారం 11గంటల సమయంలో నామినేషన్ వేయనున్నారు. స్థానిక తహసీల్ధార్ కార్యాలయంలో వున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలు అం దించేందుకు నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా రాను న్నారు.

## జనసేన జామి మండల అధ్యక్షుడిగా పీవీఆర్ వర్మ

**జామి:** మండల జనసేన పార్టీ అధ్యక్షుడిగా రామభద్రపురం అగ్రహారం గ్రామానికి చెందిన జనసేన సీనియర్ నేత పీవీఆర్ వర్మరాజు ఎన్నికయ్యారు. ఇతనికి నియోజకవర్గ అధ్యక్షుడు సత్యనారాయణ మంగళవారం నియామక పత్రం అందించారు. ఇతనితో పాటు మండల పార్టీ ఉప అధ్యక్షుడుగా వారాది స్వామినాయుడును నియమించారు.

## 13న వాణిజ్య సంస్థలకు సెలవు దినం

**విజయనగరం రింగురోడ్డు:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే నెల 13న జిల్లాలో ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలకు సెలవు దినంగా కార్మిక శాఖ ప్రకటించిందని ఉప కార్మికశాఖ కమిషనర్ ఎన్ సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం, ఏపీ సాధారణ పరిపాలన ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం దుకాణాలు, సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సెలవు ప్రకటించామన్నారు.

## ప్రపంచ పుస్తక దినోత్సవం

**తెర్లాం:** స్థానిక గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించామని గ్రంథాలయ శాఖాధికారి కృష్ణమూర్తి అన్నారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి త్రినాథ రావు, పాపారావు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు బాలశిక్ష, పురాణాలు, ఇతిహాస కథలు, నీతి కథలు, చదివించారు. అంగన్‌వాడీ కార్యకర్త వై. శ్రీదేవి పాల్గొన్నారు.

## రాజకీయ స్వార్థం కోసమే టీడీపీపై విమర్శలు

**విజయనగరం రూరల్:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుల్లో ఒకరైన జ్వాలాపూర్ శ్రీకాంత్, రాజకీయ స్వార్థంతో బ్రాహ్మణులు, టీడీపీపై విమర్శలు చేస్తున్నారని, ఈ విమర్శలను టీడీపీ బ్రాహ్మణ విభాగం తరఫున ఖండిస్తున్నట్టు ఆ విభాగం ప్రతినిధులు పేరి రామయ్య పంతులు, బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ మాజీ సభ్యుడు వాయి నందన శర్మ, జంధ్యాల బుచ్చిబాబు ప్రకటించారు. మంగళవారం బ్రాహ్మణ విభాగం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ స్వార్థం కోసం జ్వాలాపూర్ ఇటువంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని ఆయన సూచించారు.

## రేపటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

**చీపురుపల్లి:** స్థానిక బాలభవన్‌లో గురువారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ డైరక్టర్ సుంకరి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 వరకు తరగతులు ఉంటాయని చెప్పారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరంలో శాస్త్రీయ సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, అల్లికలు, తబలా, కీబోర్డు ప్లేయింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాల కోసం 8639759964, 8099141784, 8466920639 నెంబర్లకు సంప్రదించాల న్నారు.

## ఘనంగా పుస్తక దినోత్సవం

**చీపురుపల్లి:** ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని చీపురుపల్లి పట్టణంలో మంగళవారం నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశయ ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం రహేనా బేగం మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

## ఆలోచించి ఓటెయ్యండి

**విజయనగరం రింగురోడ్డు:** ప్రతి ఒక్కరూ విజ్ఞతో ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అఖండ విజయంతో గెలిపించాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలైన సీపీఐ, సీపీఎం పార్టీ జిల్లా నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, వామపక్ష నేతలు డోలా శ్రీనివాసరావు, జమ్ము ఆదినారాయణ, శ్రీనివాస్, బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్

**వంగర:** చంద్రబాబుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందని టీడీపీ నాయకలు మురళి, శ్రీను రవితో పాటు పలువురు అన్నారు. పటువర్ధనంలో మంగళవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు జగన్ చేసిన దగాలను వివరించారు.

## జగన్‌ది అప్పుల అప్పారావు పాలన

**రాజాం రూరల్:** జగన్‌రెడ్డి పాలన అప్పుల అప్పారావు పాలనను తలపిస్తోందని తెదేపా సీనియర్ నేత కొల్ల అప్పలనాయుడు పేర్కొన్నారు. సంత కవిటి మండలం సురవరం గ్రామానికి చెందిన 30 కు టుంబాలు టీడీపీలో చేరిన సందర్భంగా గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

## వడదెబ్బపై అవగాహన

**కొత్తవలస:** వేసవిలో ఎండల తీవ్రతపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. మంగళవారం వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో గల తుమ్మిరాపల్లి, ముసిరాం, ఉత్తరాపల్లి, రామలింగపురం గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులకు అవగాహన కల్పించారు.

## ‘ప్రజాగళం’ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

**విజయనగరం రూరల్:** సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ‘ప్రజాగళం’ పేరిట విజయనగరం నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ జంక్షన్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జనసేన నేత పాలవలస యశస్వి, బీజేపీ నాయకుడు ఇమంది సుధీర్, టీడీపీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరౌతారన్నారు. సాయంత్రం ఐదు గంటలకు ఈ సభ జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, పిల్లా విజయ్‌కుమార్, కర్రోతు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూములను సిద్ధం చేయాలి

● జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

**కలెక్టరేట్, ఏప్రిల్ 23:** ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు, లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాట్లపై నోడల్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జేఎన్‌టీయూ, లెండి కళాశాలల్లో ఉన్న సదుపాయాలపై తొలుత పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ ముగిశాక అలసిపోయి వచ్చే సిబ్బంది ఏమాత్రం ఇబ్బంది పడకుండా రిసెప్షన్ సెంటర్‌కు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. తమకు కేటాయించిన కౌంటర్ వద్దకు చేరుకునేలా డైరెక్షన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వారి నుంచి ఈవీఎంలను తీసుకుని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు సరిపడా సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని స్టాండింగ్ ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిచోటా తాగునీటి సదుపాయం ఉండాలని, అవసరమైనన్ని మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. లెండి కళాశాల వద్ద సుమారు 14 వేల మందికి, జెఎన్‌టియూ వద్ద సుమారు 6 వేల మందికి భోజన సదుపాయం కల్పించాల్సి ఉంటుందన్నారు. పని ముగిసిన తరువాత ఎన్నికల సిబ్బంది తమ ప్రాంతానికి తిరిగి వెళ్లేందుకు అనువుగా బస్సులను అక్కడి నుంచే నడపాలని సూచించారు. స్ట్రాంగ్ రూములకు వెంటిలేషన్ లేకుండా కిటికీలను పూర్తిగా మూసివేయాలని, లోపలికి విద్యుత్ సరఫరా ఉండ కూడదని, వాటి తలుపుల వద్ద, వరండాలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ రోజు స్ట్రాంగ్ రూముల నుంచి రిసెప్షన్ సెంటర్ల వరకూ మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఆ తరువాత అటువైపు రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామని చెప్పారు. సమావేశంలో జేసీ కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, డీఆర్వో అనిత, ఆర్‌డీవో సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి: కళా



మాట్లాడుతున్న కళా వెంకటరావు

**చీపురుపల్లి:** కూటమి గెలుపుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళావెంకటరావు అన్నారు. మంగళవారం రాత్రి కస్పా వీధిలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ముల్లు రమణ, గరివిడి మండలం కుమరాం పంచాయతీ సర్పంచ్ ముల్లు రమాదేవి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ముల్లు రమణ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన సుమారు 150 కుటుంబాలకు ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కళా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అన్ని వర్గాలకు మేలు చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. కూటమి తరఫున పోటీలో ఉన్న తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన వనజాక్షి

**నెల్లిమర్ల:** గజపతినగరం నియోజ కవర్గంలోని బొండపల్లిలో మంగళవారం నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలోని పార్టీ పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడు తూ ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. టీడీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి అ నూరాధ బేగం పాల్గొన్నారు.

## రామతీర్థంలో హనుమాన్ విజయోత్సవం

**నెల్లిమర్ల:** హనుమాన్ విజయోత్సవ దినం సందర్భంగా మంగళవారం రామతీర్థం రామస్వామి దేవస్థానంలో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చైత్ర పౌర్ణమి నాడు నికుంభుడు తదితర రాక్షసులను హనుమంతుడు సంహరించి విజయం సాధించాడని, ఆ విజయాన్ని పురస్కరించుకుని ఏటా హనుమాన్ విజయోత్సవ దినాన్ని నిర్వహిస్తున్నారని అర్చకుడు ఖండవిల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యిలతో అభిషేకాలను నిర్వహించారు.

## జీడి తోట దగ్ధం

● ఘటనా స్థలానికి చేరుకోని అగ్నిమాపక సిబ్బంది

**శృంగవరపుకోట రూరల్:** బొడ్డవర పంచాయతీ లచ్చందొరపాలెం సమీపంలో సుమారు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జీడితోట అగ్నికి ఆహుతయ్యింది. మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు లచ్చందొరపాలెం సమీపంలో ఉన్న జీడి తోటకు నిప్పు అంటుకుంది. దీంతో చుట్టుపక్కల ఏడుగురు రైతులకు చెందిన తోటలకు మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని, దీంతో జీడిపంటను కోల్పోయామని బాధితులు గేదెల బొంగరయ్య, గేదెల చందు, బుదరయ్య, గేదెల రామారావు తదితరులు వాపో యారు. ఈ ప్రమాదం వల్ల సుమారు రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగిందని గిరిజన యువత చెబుతున్నారు. ఈ విషయంపై ఎస్.కోట అగ్నిమాపకశాఖ అధికారి మదీనాను వివరణ కోరగా, ఫోన్ వచ్చిన సమయంలో తాము వేపాడ మండలంలో అగ్నిప్రమాదం నివారణకు వెళ్లామని చెప్పారు. అయితే కొత్తవలస సిబ్బందికి సమాచారం ఇచ్చినా వారు అందుబాటులో లేరని తెలిపారు.

## ఆదివాసీలంటే ఎందుకంత చిన్నచూపు?

**శృంగవరపుకోట రూరల్:** మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో నివసిస్తున్న ఆదివాసి బిడ్డలంటే వైద్యశాఖ చిన్నచూపు చూస్తోందని మండల ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు జె.గౌరీష్ తదితరులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ గతంలో రహదారులు లేవని రావడం మానేశారని, ఇప్పుడు ఎంతోకొంత రోడ్డు సౌకర్యం ఉన్నా ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. గడిచిన మూడు నెలల్లో మూడు ప్రాణాలు గాలిలో కలిసినా వీరిలో మార్పు రాకపోవడం దారుణమన్నారు. వీరిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆదివాసీలు ఉద్యమానికి సిద్ధం అవుతారని స్పష్టంచేశారు.

## వనంగుడి, చదురుగుడుల్లో ప్రత్యేక పూజలు



చదురుగుడి వద్ద చండీహోమం

**విజయనగరం రూరల్:** పైడిమాంబ ఆలయాల్లో(మూడు లాంతర్లు వద్ద చదురుగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి) మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదురుగుడి వద్ద చండీయాగాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మంగళవారం పైడిమాంబకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. లడ్డూలు, బూర్లెను పైడిమాంబకు ప్రసాదంగా నివేదించారు. ఇక వనంగుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం మూడు లాంతర్లు, పైడిమాంబ ఆలయం బయట పైడిమాంబ ఆధ్యాత్మిక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో ప్రసాద్‌రావు, ఆలయ సూపరింటెండెంట్ ఏడుకొండలు పర్యవేక్షించారు.

## చంద్రబాబును సీఎం చేస్తేనే సంక్షేమం: కోండ్రు



రేగిడి: కొమిరిలో పార్టీలో చేరిన వారితో కోండ్రు

**రేగిడి:** చంద్రబాబును మళ్లీ సీఎం చేస్తేనే సంక్షేమ రాజ్యం వస్తుందని మాజీ మంత్రి కోండ్రు మురళీ మోహనరావు ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలో చిన్నపుర్లి, పెద్దపుర్లి, దేవుదళ, గోపంపేట, కొమిర, వెంకటాపురం, ఖండ్యాం, వన్నలి తదితర గ్రామాల్లో మంగళవారం కోండ్రు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్, మజ్జి శ్రీనివాసరావు, గురువాన రమేష్ తదితర్లు పాల్గొ న్నారు. ● మండలంలో ఖండ్యాం, కొమరి గ్రామాల్లో వైసీపీకి భారీషాక్ తగి లింది. ఖండ్యాంలో అత్యంత రాజకీయప్రాధాన్యం ఉన్న దివంగత గొలివి శ్రీనివాస రావు కుటుంబీకులు టీడీపీ తీర్థం స్వీకరించగా, కొమిరిలో వైసీపీకి పట్టుగా ఉన్న 30 దళితకుటుంబీకులు టీడీపీ తీర్థం స్వీకరించారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో ఈ గ్రామాలకు వచ్చిన మాజీ మంత్రి కోండ్రు సమక్షంలో వీరు టీడీపీ తీర్థం స్వీకరించారు. ● **రాజాం:** మండలం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మంగళవారం 110 కుటుంబాలు కోండ్రు మురళీ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాజాం టౌన్ వైసీపీకి చెందిన నాయీబ్రాహ్మణ కుటుంబాలు 30, వంగర మండలానికి చెందిన 20 కుటుంబాలు, సంతకవిటి మండలం సురవరం గ్రామానికి మాజీ సర్పంచ్ కొబగాన సదాశివంతో పాటు 50 కుటుంబాలు, 10 తెలగ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.

## ప్రజలను మోసం చేసిన జగన్: బేబీనాయన



రామన్నదొరవలస ఎన్నికల ప్రచారంలో బేబీనాయన

**రామభద్రపురం:** గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత వాగ్దానా లు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తు గా ఓడించాలని బొబ్బిలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి బేబీనాయన ప్రజలను కోరారు. మండల పరిధిలోని దుప్పలపూడి గ్రామంలో మొదటిసారి మంగళ వారం ప్రచారం నిర్వహించారు. నాయకులు చింతల రామకృష్ణ, మడక తిరుపతి నాయుడు, కర్రోతు తిరుపతి రావు, కరణం విజయబాస్కర్, దుప్పలపూడి టీడీపీ నాయకుడు బర్ల రామారావు, కందిపల్లి సత్యనారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొ న్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి పట్టణం 25వ వార్డు పరిధిలోని రామన్నదొరవలస గ్రా మంలో మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గిరిజనులను కలుసుకొని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలరు కళ్యంపూడి లక్ష్మీసత్యనారాయణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ● **రామభద్రపురం:** మండలంలోని శిష్టు సీతా రాంపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు శిష్టు సత్యనా రాయణ ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. మంగళవారం బేబీనాయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. గొల్లలపేట గ్రామా నికి చెందిన మరో 10 కుటుంబాలు కూడా వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు.

## ప్రభుత్వ చెరువు స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

**బొబ్బిలి:** బొబ్బిలి పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి రెవిన్యూలో సర్వే నెంబరు 100-10 లో 0.81 ఎకరాల విస్తీర్ణంలో గల కోటగిరి వాని చెరువు (ప్రభుత్వ భూ మి) వివాదస్పదస్థలంలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ చెరువులో ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ఆక్రమణలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీ సుకుంటామని అ క్కడ ఫ్లెక్సీ పెట్టి హెచ్చరిక జారీ చేశారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**రాజాం/రూరల్:** అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని పాలకొండ జంక్షన్, బొబ్బిలి జంక్షన్ వద్ద వీటిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. రేగిడి మండలం సంకిలి గ్రామానికి చెందిన లక్ష్మణరావుకి చెందినవిగా ప్రాథమికంగా గుర్తించినట్లు సి.ఐ. వివరించారు.

## నీలిగిరితోటలు దగ్ధం

**వేపాడ:** మండలంలోని వీలుపర్తి-వెల్లాం గ్రామ సమీపంలోని దారపురెడ్డి రాము కళ్లాల సమీపంలో సంభవించిన అగ్నిప్రమాదంలో నీలగిరి తోటలు, సరుగుడు తోటలు దగ్ధం కాగా దారపురెడ్డి రాముకు సంబంధించిన రెండు గడ్డివాములు కాలి బూడిదయినాయి. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరగడంతో అగ్నిమాకప సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారుగా 6 ఎకరాలల్లో నీలగిరి తోటలు దగ్ధమైనట్టు గ్రామస్తులు తెలిపారు.

**తెర్లాం:** మండలంలో అమిటి గ్రామంలో 10 మంది రైతుల గడ్డి కుప్పలు మంగళవారం అగ్నికి అహుతయ్యాయి. రాజాం, బాడంగి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. దీనిపై వీఆర్వో పోలినాయుడు మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్లు జైలు

**విజయనగరం క్రైం:** జిల్లాలోని పూసపాటిరేగ పోలీసుస్టేషన్ పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్లె రాంబాబుపై 2021లో దిశా మహిళా పోలీసుస్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు 2,500 రూపాయలు జరిమానా విధిస్తూ, పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి మంగళవారం తీర్పు వెల్లడించినట్టు దిశా మహిళా పోలీస్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. కృష్ణాపురానికి చెందిన గొర్లె రాంబాబు 2021 జూలై 5న మైనర్ బాలిక ఇంట్లో చొరబడి అసభ్యంగా ప్రవర్తించగా, దిశా మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మహిళా ఎస్ఐ కేటీఆర్ లక్ష్మీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి ఆధారాలు ప్రవేశపెట్టడంతో న్యాయస్థానంలో నేరారోపణ రుజువుకావడంతో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగమణి జైలు శిక్షతో పాటు, 2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు డీఎస్పీ తెలిపారు.

## తెర్లాం తహసీల్దార్‌కు షోకాజ్

**కలెక్టరేట్:** విధులకు హాజరు కాని తెర్లాం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు, జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. తహసీల్దార్ సతిమణికి ఆరోగ్య సమస్య ఉండటంతో ఆయన ఉన్నతాధికారుల నుంచి సెలవు కోరారు. ప్రస్తుతం ఎన్నికల విధులు ఉండటంతో సెలవు మంజూరు చేయకపోవడం వల్ల, ఆయన విధులకు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. దీంతో తెర్లాం తహసీల్దార్‌గా విజయనగరం ఆర్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో రాజ్యలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. మరోవైపు తహసీల్దార్ ప్రసన్నకుమార్‌పై సీసీఎల్ఏకు జిల్లా అధికారులు లేఖ రాసి, ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది.

## చెత్త వేసిన వారికి నోటీసులు తప్పదు

**బొబ్బిలి:** బొబ్బిలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అపారిశుధ్యానికి కారకులవుతున్న వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి మంగళారం సిబ్బందిని ఆదేశించారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె మల్లమ్మపేట, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం, కోటిచెరువు రోడ్డులో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. కోటిచెరువు గట్టు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో అపారిశుధ్య పరిస్థితిపైఆర్టీసీ అధికారులకు నోటీసులు ఇస్తామన్నారు. స్థానికులకు కూడా నోటీసులు ఇవ్వాలని ఆమె ఆదేశించారు.











ANDHRA JYOTHI CLASSIFIEDS

ఆంధ్రజ్యోతి

**అద్దె/లీజు కొరకు**

★ పాలకొండలోగల మూడు డాక్టర్ సి.ఎల్. నాయుడు కళ్యాణ మండపాలు ఏసీ రూమ్స్‌తో సహా అద్దె/లీజు కొరకు కలవు. కావలసినవాళ్లు సంప్రదించగలరు. కాంట్రాక్ట్ నెంబర్: 9440631123

AJS

**అద్దె/అమ్మకం కొరకు**

★ పాలకొండలో ఉన్న డాక్టర్ సి.ఎల్. నాయుడు కళ్యాణ మండపాలకు అనుకుని ఒక్కొక్క అంతస్తు 9000 చదరపు అడుగులు చొప్పున ఉన్న 3అంతస్తుల భవనం బ్యాంకులు, ఆఫీసులు, వాణిజ్యపరమైన అవసరాలకు అద్దె/అమ్మకమునకు కలదు. కావలసిన వాళ్ళు సంప్రదించగలరు. కాంట్రాక్ట్ నెంబర్: 9440631123

AJS

ఆంధ్రజ్యోతి

అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.

ఫోన్ నెంబర్లు : ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266